కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్, మే 17: జిల్లాలో వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని మిల్లర్లతో వడ్ల కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ ఎం డేవిడ్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అనంతరం మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా వేగవంతంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. మిల్లర్లు ఎక్కడ ధాన్యం ఉంటే అక్కడ వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. 2021-22 యాసంగి కాలానికి సంబంధించిన ధాన్యాన్ని మిల్లులు డిఫాల్ట్ కావడం వల్ల వారు కట్టాల్సిన 25 శాతం పెనాల్టీలకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ మొత్తాన్ని కట్టమని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. 2023-24 సంబంధించిన సీఎంఆర్ డెలివర్లను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత అధికారులు, జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల గోదాం పరిశీలన..

కేసముద్రం: మండలంలోని కేసముద్రం విలేజి ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు నిల్వ చేసే గోదామును శుక్రవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పరిశీలించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కేసముద్రం నుంచే పాఠ్య పుస్తకాలు సరఫరా అవుతుంటాయి. ఈ మేరకు కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పుస్తకాలను తీసుకొచ్చి సంబంధిత పాఠశాలలకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీఈవో రామారావు, తహసీల్దార్ దామోదర్, ఎంపీడీవో రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు కొత్త జగన్‌మోహన్‌రెడ్డి, ఈవో అశోక్ ఉన్నారు.

దవాఖాన రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

వైద్యులు అప్రమత్తంగా పనిచేయాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

మహబూబాబాద్, మే 17: ప్రాథమిక వైద్యశాలల్లోని వైద్యులు అప్రమత్తంగా పని చేయాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి ఆదేశించారు. శుక్రవారం మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీలోని వీరారం తండాను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తండాలో ఆర్‌బీఎస్‌కే బృందం ఏ విధంగా పని చేస్తుందో పరిశీలించారు. తండాలో డ్రైడ్రైడే నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. తీవ్రమైన ఆహార లోపంతో బాధపడుతున్న రెండేళ్ల బాలుడిని గుర్తించి వెంటనే ఎంజీఎం దవాఖానలోని ఎన్‌ఆర్‌సీ విభాగానికి మెరుగైన వైద్యం కోసం పంపించారు. అనంతరం పట్టణంలోని పీహెచ్‌సీని, బెస్తబజారులోని సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు కావాల్సిన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో వైద్యులు అంబరీష, రమ, సబ్ యూనిట్ అధికారి వడ్డిబోయిన శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

డోర్నకల్, మే 17: ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు. నీడ కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజూ చెత్త సేకరించాలని, కంపోస్టు యార్డులో ఎరువు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీవో మీర్జా మున్వర్ బేగ్, ఎంపీవో పార్థసారథి, ఈసీ రఘు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డస్ట్, కంకర పోసి మరమ్మతులు చేసిన దృశ్యం

రహదారికి మరమ్మతులు..

ఇనుగుర్తి, మే 17: మండలంలోని చిన్ననాగారం ప్రధాన రహదారి నుంచి సీతారాంపురం వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో అందులో నీరు నిల్వ ఉంటున్నది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ డివిజన్ యూత్ ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చులతో డస్ట్, కంకర తెప్పించి రహదారికి మరమ్మతు చేయించారు. ప్రజల సౌకర్యార్థం రహదారికి మరమ్మతులు చేయించిన శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బండారి రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భూక్యా బాలాజీ, బొబ్బల ముత్తయ్య, బింగి శరత్‌బాబు, బత్తిని మురళి, బైరు హరిప్రసాద్, కార్యదర్శి వేద రాజేశ్వర్ ఉన్నారు.

SVS GROUP OF INSTITUTIONS
BHEEMARAM-506 015, HANAMKONDA (Dist.)
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTU, Hyd)
Phone No.: 9391949237
Email: info@svsit.ac.in, www.svsit.ac.in
WALK IN INTERVIEW
For Additional Faculty
On 18-05-2024 from 10.00 AM Onwards
Professors, Associate Professors & Asst. Professors
In the following Engineering/ MBA/ Pharmacy/ H&S Departments having Ph.d in relevant branches with First Class in PG
Qualifications & Pay as per AICTE Norms Attend along with all relevant Certificates, Aadhar & PAN Documents.
Sd/- SECRETARY

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

కురవి: మత్తడి పోస్తున్న మోద్గులగూడెం చెరువు

తొర్రూరు: కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యం

నర్సింహులపేట : కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

గార్ల : ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు
- వరద నీటితో చెరువులు, వాగుల్లో జలకళ
- జిల్లాలో యావరేజ్‌గా 70.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

డోర్నకల్: మున్నేరు వాగు చెక్‌డ్యామ్ పైనుంచి పోస్తున్న మత్తడి

బయ్యారం : నీటితో కళకళలాడుతున్న బయ్యారం పెద్దచెరువు

మహబూబాబాద్, మే 17: అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. చేతికి వచ్చిన పంట నీటి పాలైంది. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల కోసం నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు వాటిని ఆరబెట్టేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో యావరేజ్‌గా 70.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8:30 గంటల వరకు కొత్తగూడలో 19.6, గంగారంలో 17.6, బయ్యారంలో 91.4, గార్లలో 104.4, డోర్నకల్‌లో 70.0, కురవిలో 116.2, మహబూబాబాద్‌లో 118.6, గూడూరులో 26.2, కేసముద్రంలో 39.8, నెల్లికుదురులో 104.6, నర్సింహులపేటలో 99.0, చిన్నగూడూరులో 44.2, మరిపెడలో 93.8, దంతాలపల్లిలో 81.2, తొర్రూరులో 62.4, పెద్దవంగరలో 42.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

తొర్రూరులో ఆరు సెంటీమీటర్ల వర్షపాతం

తొర్రూరు: తొర్రూరు మండలంలో 6 సెంటీమీటర్లు, పెద్దవంగర మండలంలో 4సె.మీ వర్షపాతం కురిసింది. తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. రైతులు తీసుకొచ్చిన 11,874 బస్తాల ధాన్యం నిల్వలు కేంద్రాల్లోనే ఉండగా వీటిలో సుమారు 2వేలకు పైగా బస్తాలు తడిచిపోయాయి. ఇవే కాకుండా కాంటా పెట్టని సుమారు 15వేల బస్తాల ధాన్యం నిల్వలు కేంద్రాల్లో ఉండగా సుమారు 3వేల బస్తాలు వర్షం కారణంగా తడిచిపోయాయి. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడు

ముంగిమడుగు కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వడ్లు

నర్సింహులపేట: మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ముంగిమడుగు కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్ ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయింది. కాంటాలు పెట్టిన ధాన్యం మిల్లులకు తరలించకపోవడంతో బస్తాల కింద వర్షపు నీరు చేరి ధాన్యం మొలకెత్తింతని మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధుల్లో నిలిచిన నీరు..

చిన్నగూడూరు: వర్షాల కారణంగా మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో వరద నీరు నిల్వ ఉండడంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు అంతంత మాత్రమే ఉండడంతో వర్షం వస్తే మోకాళ్లలోతు నీటిలో వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మున్నేరు వాగులో జలకళ

కురవి : రోడ్డును తవ్వి వరద నీటిని మళ్లింపు

డోర్నకల్: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో డోర్నకల్ శివారులోని మున్నేరు వాగులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతున్నది. దీంతో కొత్తగా నిర్మించిన చెక్ డ్యామ్ పై నుంచి మత్తడి పోస్తున్నది. మున్నేరు వాగులో జలకళ సంతరించుకున్నది. అదేవిధంగా మండలంలోని పలు చెరువులు, కుంటల్లో వరద వచ్చి చేరుతున్నది. కొన్ని కుంటలు పూర్తిగా నిండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తూ, వ్యవసాయ పనులు ప్రారంభించారు.

దంతాలపల్లి : కోతకు గురైన దంతాలపల్లి చిన్న చెరువు

పెద్ద చెరువులో తొమ్మిది అడుగులకు నీటిమట్టం

బయ్యారం: అకాల వర్షం వల్ల మండల కేంద్రంలోని పెద్ద చెరువులోకి వరద చేరడంతో నీటి మట్టం తొమ్మిది అడుగులకు చేరింది. పందిపంపుల వాగు, మసివాగు ప్రవహిస్తుండడంతో చెరువులోకి వరద వస్తుండడంతో నిన్నటి వరకు నీరు లేక వెల వెలబోయిన పెద్ద చెరువు నేడు జలకళను సంతరించుకున్నది. అదేవిధంగా గ్రామాల్లోని చెరువుల్లోకి వరద చేరుతున్నది. ఈదురు గాలుల వల్ల రామచంద్రాపురంలో విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో విద్యుత్ అధికారులు నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. వెంకట్రాంపురంలో పిడుగు పడడంతో జక్కుల తిరుపతయ్యకు చెందిన గేదె మృతి చెందింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు

గార్ల: మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గార్ల, రాంపురం, మద్దివంచ, కొత్త తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. పాకాల ఏటిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని న్యూడెమోక్రసీ, సీపీఐ నాయకులు నిరసనవ్యక్తం చేశారు. మండలంలోని గార్ల పెద్ద చెరువులో జలకళ సంతరించుకున్నది.

కురవిలో రైతుల ఆగమాగం

కురవి: అకాల వర్షానికి కురవి, సీరోలు మండలాల్లోని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని నాగమయ్య దేవస్థాన ఆవరణలో ఏర్పాటుచేసిన వరిధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. టార్పాలిన్‌లు కప్పినా వరదకు ధాన్యం కొట్టుకుపోయింది. కాంటా అయిన ధాన్యం కూడా తడిసింది. ఉప్పరిగూడెంలో వాటర్ ప్లాంట్‌పై రేకుల షెడ్ కొట్టుకుపోయి సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లింది. మోద్గులగూడెం చెరువు మత్తడి పోసింది. మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్యాతండా గ్రామ పరిధిలోని పిల్లిగుండ్ల తండాకు వెళ్లే దారిలో రైల్వేగేట్ వద్దకు వరద చేరడంతో అధికారులు జేసీబీ సాయంతో రోడ్డును తవ్వి నీటిని దారి మళ్లించారు.

దంతాలపల్లిలో మోస్తరు వర్షం

దంతాలపల్లి: మండలంలో కురిసిన వర్షానికి దంతాలపల్లి చిన్న చెరువు కట్ట కోతకు గురైంది. దాట్ల గ్రామంలో సీసీ రోడ్డుకు పోసిన మట్టి మెత్తబడడంతో అటువైపు వెళ్లిన రైతుల బైక్‌లు అందులో కూరుకుపోయాయి. దీంతో ఇబ్బంది పడ్డారు.

తొర్రూరు : కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

నర్సింహులపేట : కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

చిన్నగూడూరు: ముదిరాజ్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

బయ్యారం : పిడుగు పడి మృతి చెందిన గేదె

'రైతులను దగా చేస్తే సహించం'

కొత్తగూడ, మే 17 : రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అతిక్రమించితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల వ్యవసాయాధికారికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఈక విజయ్, లచ్చయ్య, సుకేందర్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన..

నర్సింహులపేట, మే 17: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పెద్దనాగారం, కొమ్ములవంచ గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ పతాకావిష్కరణ అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పూజలు, హోమం నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, దేవేంద్రాచారి, సత్యనారాయణ, రామాచారి, వీరాచారి ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

ఐకేపీ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

మహబూబాబాద్, మే 17: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ అనుబంధ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే బాబన్న, హలావత్ లింగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌ను వారు సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని తేమశాతం అధికంగా ఉందని వ్యాపారులు కొనడం లేదన్నారు. టోకెన్ పద్ధతిన కాంటాలను ఆపడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య, అఖిలభారత రైతుకూలీ సంఘం నాయకులు లింగంపల్లి లింగన్న, జంగిలి సోమనర్సయ్య, లెంకల ఎల్లయ్య, వీరన్న, శిరంశెట్టి సత్యం, సురేశ్, లింగన్న, బాలు, రత్నం, వెంకన్న, రమేశ్, అలకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గంగారం: వర్షాల వల్ల రైతులు పండించిన పంట తడిచిపోయిందని, ప్రభుత్వం పంట నష్ట సర్వే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మక్క జొన్న, మామిడితోటలు దెబ్బతిన్నాయని, ప్రతి ఎకరం పంటకు ప్రభుత్వం రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వర్షాకాల సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు బ్యాంకు రుణాలు సకాలంలో అందించాలన్నారు. ఊకు భిక్షం, జెజ్జురి వీరస్వామి, కురసం రంగయ్య, ఈసం వెంకటయ్య, జెజ్జురి సమ్మయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

దంతాలపల్లి, మే 17: మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా పోరాడేందుకు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి మంజంపల్లి వీరన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రలను ఆయన విడుదల చేసి అనంతరం మాట్లాడారు. నేడు జరుగుతున్న రాజకీయ మార్పులతో 80శాతం ఉన్న పేద, సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి తీవ్రనష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఊడుగుల రాములు, సెగం యాకయ్య, లింగయ్య, యుగేంధర్, రమేశ్, వెంకన్న, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన శ్మశానవాటిక

కబ్జాకు గురైన శ్మశానవాటిక

ఇనుగుర్తి, మే 17: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానవాటిక 1.30 ఎకరాలు కబ్జాకు గురైందని కాలనీవాసులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నరసింహరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 70 ఏండ్ల క్రితం గ్రామానికి చెందిన ఒద్దిరాజు సోదరులు, ఆకుల రామయ్య తమకు శ్మశానవాటిక కోసం 1.30 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారని తెలిపారు. ఆ భూమిని గ్రామానికి చెందిన గుజ్జునూరి బొందయ్య వారం రోజుల నుంచి జేసీబీతో చదును చేయించి ఆక్రమించుకున్నారని తెలిపారు. కబ్జాకు గురైన భూమిని తిరిగి ఎస్సీలకు ఇప్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ఐ నరసింహరావును వివరణ కోరగా.. శ్మశానవాటిక భూమి కబ్జాకు గురైందని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ప్రేరణ ఉత్సవ్'కు పొనుగోడు విద్యార్థిని

గూడూరు, మే 17: ప్రేరణ ఉత్సవ్‌కు పొనుగోడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపికయ్యారు. ఇటీవల జాతీయ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అక్షరాస్యత విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని భూక్యా సావిత్రి జిల్లా నుంచి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రజిత శుక్రవారం తెలిపారు. జిల్లాలోని 61 పాఠశాలల నుంచి మొత్తం 124 మంది విద్యార్థులు పాల్గొనగా, సావిత్రి ఎంపికయ్యారు. జూలై 14 నుంచి 20 వరకు ప్రధాని నరేంద్రమోదీ చదువుకున్న వెర్నాకుల్యర్ పాఠశాలలో అభ్యసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సావిత్రిని అభినందించారు.

సావిత్రిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యుత్ షాక్‌తో కాడెడ్లు మృతి

రహదారిపై బాధిత రైతుల ఆందోళన

మహబూబాబాద్ రూరల్, మే 17: విద్యుత్ షాక్‌తో రెండు కాడెడ్లు మృతి చెందిన ఘటన మండల శివారులో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి గాలి దుమారంతో కూడిన భారీ వర్షం పడగా, మెయిన్ లైన్ త్రీఫేస్ విద్యుత్ తీగ తెగి పడింది. శుక్రవారం ఉదయం మండలంలోని అయోధ్య గ్రామ శివారు వెంక్యాతండాకు చెందిన రైతులు అజ్మీరా బాలాజీ, బానోత్ బాలాజీ కాడెడ్లను మేత కోసం పొలంలోకి వదిలారు. దీంతో విద్యుత్ తీగ తగిలి కాడెడ్లు అక్కడికక్కడే మృతి చెందాయని, తండాకు చెందిన మరో ఐదు ఆవులకు గాయాలైనట్లు పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఎడ్లు మృతి చెందాయని, రైతులకు తగిన న్యాయం చేయాలని తండాకు చెందిన అజ్మీరా లక్ష్మణ్, కృష్ణకుమార్, నరేశ్, శంకర్ ఆధ్వర్యంలో రోడ్డుపై ఆందోళన చేశారు. గతంలో సైతం అనేక మార్లు విద్యుత్ అధికారులకు కరెంట్ సమస్యలు తెలిపినా పట్టించుకోలేదని, వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు..

మహబూబాబాద్ రూరల్/గార్ల: విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. మహబూబాబాద్ మండల శివారు బేతోలులో ఏడబోయిన నారాయణకు చెందిన గేదె, గార్ల మండల కేంద్రంలో బిడిశ లక్ష్మికి చెందిన గేదె మృతి చెందినట్లు బాధిత రైతులు శుక్రవారం తెలిపారు. బేతోలు గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు కిందకు వేళాడడంతో అటు వైపు మేతకు వెళ్లిన గేదెకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు. అదేవిధంగా గార్ల మండల కేంద్రానికి చెందిన బిడిశ లక్ష్మి పాడి గేదె పశుగ్రాసానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలో ప్రతిరోజు గేదెలు, ఆవులు మృతి చెందుతున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జీ సక్రు తెలిపారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగలను సరి చేయాలని, బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

మహబూబాబాద్ రూరల్: మృతి చెందిన కాడెడ్లు

వైభవంగా పుల్లు బాబాజీ జాతర

డోర్నకల్, మే 17: మండలంలోని లింబ్యాతండా గ్రామ పంచాయతీ లచ్చాతండాలో వేంకటేశ్వరస్వామి, రామచంద్ర స్వామి స్వరూపుడు శ్రీరాం సింగ్ బాబా, పుల్లు బాబాజీ ఆలయ జాతర గురువారం బాబాజీ ట్రస్టు పాలక మండలి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

అన్నకు తలకొరివి పెడుతున్న సోదరి శ్రీలత

అన్నకు తలకొరివి పెట్టిన చెల్లి

నెల్లికుదురు, మే 17 : అన్నకు చెల్లి తలకొరివి పెట్టిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దూపటి సమ్మయ్య(47) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి పిల్లలు ఎవ్వరు లేకపోవడంతో తన సోదరి మడత శ్రీలత అన్నకు తలకొరివి పెట్టింది. ఈ ఘటనను చూసిన బంధుమిత్రులు, గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.